గోదావరి తీరాన్ని పరిశీలిస్తున్న పుట్ట మధూకర్

ఇసుక కుంభకోణం కోసమే..

- కాళేశ్వరంలో నీళ్లు ఆపలేదు
- మంత్రి ఇలాకాలో భక్తులకు వసతులు కరువు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- మంథనిలో గోదావరి పరీవాహకం పరిశీలన

మంథని, ఫిబ్రవరి 26: మహా శివరాత్రి రోజున భక్తులు పుణ్యాస్నానాలు ఆచరించి శైవ క్షేత్రాలను దర్శించుకోవడం సంప్రదాయంగా వస్తుందని, అలాంటి విశిష్టమైన రోజున గోదావరి నదిలో నీళ్లు లేకుండా చేసి కాంగ్రెస్ ప్రభుత్వం భక్తులకు ఇబ్బందులకు గురిచేసిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. ఇసుక కుంభ కోణం చేసేందుకే కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లను ఆపడం లేదన్నారు. నీళ్లు లేకుండా చేస్తే ఇసుకను తోడుకొని అక్రమంగా డబ్బు సంపాదించాలన్నదే వాళ్ల ముఖ్య ఉద్దేమన్నారు. కాంగ్రెస్ పార్టీ కావాలనే మేడిగడ్డ బ్యారేజీని నిర్వీర్యం చేస్తున్నదని, ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేసి.. 14నెలలుగా నీళ్లు ఆపడం లేదన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో ఒక్క పిల్లర్ కుంగిపోతే, పైన ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు ఎలాంటి ఇబ్బందుల్లేకున్నా కావాలనే నీళ్లు నిలపడం లేదని మండిపడ్డారు. మహా శివరాత్రి సందర్భంగా పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు మంథని గోదావరి తీరంలో నీళ్లు లేక ఇబ్బందిపడుతున్న పరిస్థితిని ఆయన బుధవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. సముద్రం తలాపున పెట్టుకొని చేప నీళ్లకు ఏడ్చిన చందంగా మంథని గోదావరి పరిస్థితి తయారైందన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గ కేంద్రమైన మంథనిలో భక్తులకు ఏర్పాట్లు చేయకపోవడం బాధాకరమన్నారు. ఒక వైపు గోదావరిలో నీళ్లు నిలుపలేదని.. మరోవైపు సౌకర్యాలు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బ్యారేజీ నిర్మాణం జరగలేదని, గోదావరిలో నీళ్లు లేకుంటే గుండారం రిజర్వాయర్ నుంచి తీసుకు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడు కూడా ప్రజల శ్రేయస్సు గురించి, వారికి మంచి చేయాలని ఆలోచన చేయలేదన్నారు. దేవుడిని దర్శించుకునే ముందు పుణ్యస్నానాలు చేయడం మన సంప్రదాయమని.. ప్రజల మనోభావాలకు కనీసం గౌరవం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి గోదావరిలోకి నీళ్లను తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏగోలపు శంకర్‌గౌడ్. బీఆర్ఎస్ యూత్ నాయకులు ఉన్నారు.

చిన్నారులను ప్రోత్సహించడం అభినందనీయం

నృత్యం చేస్తున్న చిన్నారులు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 26: చిన్నారి కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని తహసీల్దార్ వాసంతి అన్నారు. మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయం ఆవరణలోని కల్యాణ మండపంలో బుధవారం బిట్ బిట్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు నృత్యప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీ ల్దార్ మాట్లాడారు. చిన్నారులను ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. చదు వుతో పాటు నృత్యాలు, క్రీడల్లో రాణిం చేలా తల్లిదండ్రులు కూడా పిల్లలకు ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్, బిట్ బిట్ అకాడమీ అధ్యక్షుడు పులిపాక దేవ, గౌరవ అధ్యక్షుడు దాసరి రామస్వామి, ఆదివరాహస్వామి ఆలయ మాజీ డైరెక్టర్ భూపెల్లి జ్యోతి, సలమాదారులు జబ్బార్ ఖాన్, కళాధర్‌రెడ్డి, నూనె రాజేశం, మట్ట రాజయ్య పాల్గొన్నారు.

పోలింగ్ విధులు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష

పెద్దపల్లి: డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సామగ్రి సరిచూసుకుంటున్నపోలింగ్ సిబంది

పెద్దపల్లి , ఫిబ్రవరి26: జిల్లాలో గురువారం నిర్వహించనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు సూచించారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న ఓటర్ల సంఖ్య ఆధారంగా అవసరమైన సామగ్రి సదరు కేంద్రాల సిబ్బందికి అందించాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో దాదాపు 31 వేల పట్టభద్రుల ఓటర్లు, 1111 ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. గ్రాడ్యుయేట్ కోసం 36 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల కోసం 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రజలకు అవసరమైన కూల్ వాటర్, క్యూలైన్ల వద్ద టెంట్, ఇతర సౌకర్యాలు కల్పించామని వెల్లడించారు. గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయ ఓటర్లందరూ తప్పని సరిగా పోలింగ్‌లో పాల్గొనేందుకు కేంద్రానికి వచ్చి, ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు బీ గంగయ్య, సురేశ్, డీఏవో దోమ ఆది రెడ్డి, ఆర్టీవో పీ రంగారావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది

జూలపల్లి, ఫిబ్రవరి 26 : జూలపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ఎస్ఐ సనత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. జూలపల్లి, ఎలిగేడు తహసీల్దార్లు స్వర్ణ, బషీరొద్దీన్ పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఆయా గ్రామాల నుంచి ఓటర్లు తరలి వచ్చి ఓటు హక్కు సద్వినియగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 26: కాల్వశ్రీరాంపూర్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వేణు పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఇక్కడ తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ముత్తారం, ఫిబ్రవరి 26: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ బీమధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో ఎం సురేశ్, ఎస్ఐ జీ నరేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని వారు పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.

అవతలి వైపు స్నానాలు చేసేందుకు మోకాళ్ల మంటి లోతులో ఉన్న నీటి నుంచి దాటుకుంటూ వెళ్తున్న భక్తులు

శివయ్య.. ఏందీ ఈ దుస్థితి!

- గోదావరిలో నీళ్లు లేక భక్తుల ఇబ్బందులు
- కిలోమీటర్ మేర ఇసుక, రాళ్లలో నడిచి పుణ్యస్నానాలు

మంథని, ఫిబ్రవరి 26: కేసీఆర్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి నిండుకుండలా దర్శనమిచ్చింది. ఏకాలమైనా సముద్రంలా కనిపించింది. ఏ పండుగ వచ్చినా భక్తులు ఘాట్ల వద్దనే పుణ్యస్నానాలు ఆచరించడం కనిపించింది. కానీ, ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. నిండుకుండలా ఉండే గోదావరి నేడు రాళ్లురప్పలు, ఇసుక దిబ్బలతో దర్శనమిస్తున్నది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచన అనే సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులోని నీటినివదిలి పెట్టింది. మంథని గోదావరి తీరానికి దిగువన ఉన్న అన్నారం సరస్వతీ బ్యారేజీ, ఎగువన ఉన్న సుందిళ్ల పార్వతీ బ్యారేజీల్లోని నీటిని పూర్తిగా వదిలిపెట్టడంతో మంథని గోదావరి తీరం ప్రస్తుతం ఏడారిని తలపిస్తున్నది. మహాశివరాత్రి వేళ గోదావరి తీరంలో నీళ్లు లేక భక్తులు ఇబ్బందిపడ్డారు. రాళ్లురప్పలను దాటుకుంటూ.. ఇసుకదిబ్బల్లో కిలోమీటరు వరకు అవతలి వైపునకు నడుచుకుంటూ వెళ్లి మోకాళ్ల లోతులో స్నానాలు ఆచరించారు. కొందరు వృద్ధులు, దివ్యాంగులు చేసేదేమీలేక మడుగులాగా ఉన్న నీళ్లలోనే స్నానాలు చేశారు. వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే శివరాత్రి రోజున గోదావరిలో నీళ్లు లేకుండా ఉన్న తీరును చూసి పలువురు భక్తులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంథని : శ్రీ గౌతమేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల పూజలు

పెద్దపల్లి కమాన్: శ్రీమడ్ల రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల క్యూ

మార్మోగిన శివనామ స్మరణ

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు
- పలు ఆలయాల్లో శివకల్యాణోత్సవం

మహాశివరాత్రి పర్వదినాన భక్తులు హరనామ స్మరణతో పులకరించిపోయారు. ఆలయాలను దర్శించుకొని 'హర హర మహాదేవ' అంటూ భక్తిపారవశ్యంలో మునిగి తేలారు. జిల్లాలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శివాలయాలతో పాటు ఇతర ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. గోదావరిఖని, మంథనిలోని గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహాశివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జిల్లాలోని పలు ఆలయాల్లో శివ కల్యాణం జరిపించారు. భక్తులు స్వామి వార్లకు పట్టు వస్త్రాలు, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు ఉపవాసాలు పాటించి, జాగరణ చేశారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

జూలపల్లి : శివకల్యాణాన్ని తిలకిస్తున్న రఘువీర్‌సింగ్, నల్ల మనోహర్‌రెడ్డి

జ్యోతినగర్: చిలుకలయ్యగుడిలో పట్టువస్త్రాలు తలంబ్రాలతో భక్తులు

జిల్లాలోనే పెద్ద శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివ చ్చారు. వేదపండితులు దూపం వీరభద్రయ్య, మఠం భవానీప్రసాద్, పంచాక్షరి, గంగాధర్, నర్సింహాచార్యులు, అభిషేక్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు ప్రత్యేక అభిషేకం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ వేణు, పెద్దపల్లి జూనియర్ సివిల్ జడ్జి మంజుల, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, కరీంనగర్ డీఆర్డీవో పీడీ శ్రీధర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు. పెద్దపల్లి మండలం రాగినేడులోని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వర స్వాముల కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా జరిపించారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. జూలపల్లి, కాచాపూర్‌లో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిపించారు. మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఆలయ పునర్నిర్మాణ దాత నల్ల మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి స్వామివారికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకు వచ్చారు. శివనామ స్మరణతో భక్తులు ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు దర్శించుకున్నారు. పెద్దపల్లిలోని శ్రీ మడ్ల రామ లింగేశ్వరస్వామి, జనగామ త్రిలింగ రాజరాజ్యేశ్వరస్వామి ఆలయంలో ఎంపీ వంశీ కృష్ణ పూజలు చేశారు.

ముత్తారం : బహుగుళ్లలోని కోనేరులో స్నానం చేస్తున్న భక్తులు

ఓదెల: మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బీసీల పల్లెబాటను విజయవంతం చేయాలి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పోస్టర్ విడుదల చేస్తున్న కొప్పుల ఈశ్వర్, నాయకులు

ధర్మారం,ఫిబ్రవరి26:బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన 'పల్లెబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. కరీంనగర్ లోని తన స్వగృహంలో పల్లెబాట పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన బీసీల చైతన్యం, ఐక్యత కోసం పల్లెబాట నిర్వహించడం అభినందనీయమని అన్నారు. బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్, కరీంనగర్ జిల్లా కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్, ధర్మపురి అసెంబ్లీ అధ్యక్షుడు ముదాం శ్రవణ్ కుమార్, అస్లాం పాల్గొన్నారు.

వంద కుటుంబాలకు సరుకులు అందజేత

హెల్పింగ్ హ్యాండ్స్ ఉదారత

సరుకులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 26: నిరుపేద కుటుంబాలు, ఆపదలో ఉన్నవారితో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మేము ఉన్నామంటూ తమవంతుగా చేయూతనందిస్తున్నది హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కమాన్‌పూర్ బస్టాండ్ వద్ద బుధవారం మహాశివరాత్రి – మహా దానం పేరిట ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నారగోని సతీశ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 100 మంది నిరుపేదలను గుర్తించి దాదాపు రూ.3లక్షల విలువైన నిత్యావసరాలు అందజేశారు.ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం బస్తాతో పాటు 23 రకాల సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో 2018 నుంచి ఇప్పటి వరకు చేపట్టిన 41సేవా కార్యక్రమాల వివరాలు తెలిపే బుక్‌లెట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్‌పూర్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, నాయకులు మచ్చగిరి రాము, పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, పిల్లి చంద్రశేఖర్, నీలం శ్రీనివాస్, గుర్రం లక్ష్మిమల్లు, మట్ట శంకర్, గడప కృష్ణమూర్తి, రంగు సత్యనారాయణ, జంగపెల్లి అజయ్, కొండ వెంకటేశ్, ఎండీ ముస్తాక్, నల్లవెల్లి శంకర్, అనవేన లక్ష్మి రాజం, మల్లారపు అరుణ్‌కుమార్, మల్లారపు అరుణ్‌కుమార్, బొజ్జ నర్సింహచారి, నగునూరి నర్సయ్య గౌడ్, మహమ్మద్ యూసుఫ్ లల్లూ, హెల్పింగ్ హ్యాండ్స్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కాల్వశ్రీరాంపూర్, /ఓదెల, ఫిబ్రవరి26: కాల్వశ్రీరాంపూర్, ఓదెల హైస్కూల్‌లో, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను రామగుండం సీపీ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ఉండాలని ఆదేశించారు. ఓదెల మల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సంభందిత అధికారులను ఆదేశించారు. అంతకు ముందు స్వామివారిని దర్శించుకొని, పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తునికి గుండెపోటు రావడంతో సీపీఆర్ చేసి, అతన్ని రక్షించిన ఎస్ఐ రమేశ్‌ను సత్కరించి, అభినందించారు. ఇక్కడ డీసీపీ చేతన, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్, రమేశ్ ఉన్నారు.

నాగేశ్వర్‌రావుకు టీబీజీకేఎస్‌లో సభ్యత్వం లేదు

యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 26: ఓసీపీ-3 ఉద్యోగి శనిగారపు నాగేశ్వర్‌రావుకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంలో సభ్యత్వం లేదని యూనియన్ నాయకులు మామిడి తిరుపతి, పసుపులేటి హరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల క్రితం టీబీజీకేఎస్ నాయకుడిని ఐఎన్‌టీయూసీలో చేర్చుకున్నట్లు ఆ యూనియన్ నాయకులు ప్రచారం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. 2023లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలోనే నాగేశ్వర్ రావు యూనియన్‌లో చేరాడని గుర్తు చేశారు. టీబీజీకేఎస్‌కు సింగరేణి కార్మికుల్లో వస్తున్న ఆదరణను చూసి, తప్పుపట్టించే విధంగా అసత్యపు ప్రచారాలు చేస్తూ తమ యూనియన్ బద్నాం చేయాలనుకోవడం తగదని వారు హితవు పలికారు.

ఆలయంలో భక్తుడికి గుండెపోటు

- సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడిన ఎస్ఐ

సీపీఆర్ చేస్తున్న ఎస్ రమేశ్

ఓదెల, ఫిబ్రవరి 26: మహా శివరాత్రి సందర్భంగా పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయానికి బుధవారం వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుకు గురికాగా, పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేశ్ సీపీఆర్ ద్వారా అతడి ప్రాణాలను కాపాడాడు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన ఒరుసు శ్రీనివాస్ బుధవారం మల్లన్న ఆలయానికి వచ్చాడు. మహాశివరాత్రి కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉన్నది. ఈ క్రమంలో శ్రీనివాస్ ఆకస్మాత్తుగా కిందపడిపోయాడు. ఆలయంలో బందోబస్తు విధుల్లో ఉన్న ఎస్ఐ రమేశ్ ఈ విషయాన్ని గమనించాడు. శ్రీనివాస్ గుండెపోటుకు గురైనట్లు గుర్తించిన ఎస్ఐ.. సీపీఆర్ చేసి అతడి ప్రాణాలను కాపాడాడు. అక్కడి నుంచి ఎస్ఐ తన వాహనంలో స్థానిక దవాఖానకు తరలించి, చికిత్స అందించారు. సకాలంలో స్పందించి సీపీఆర్ చేసిన ఎస్ఐకి పలువురు అభినందనలు తెలిపారు.

28న జాతీయ వైజ్ఞానిక దినోత్సవం

పెద్దపల్లి కమాన్, ఫిబ్రవరి 26 : జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 28న జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సృజనాత్మక సైన్స్ కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవో డీ మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్ సీవీ రామన్ కనుగొన్న 'రామన్ ఎఫెక్ట్' రోజును కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 'నేషనల్ సైన్స్ డే' గా నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. శుక్రవారం ప్రతి పాఠశాలలో విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర విషయాల్లో ప్రముఖ శాస్త్రవేత్తలతో మార్గదర్శనం, వ్యాసరచన, క్విజ్, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు, సైన్స్ పుస్తకాల ప్రదర్శన, మ్యూజియం, ప్లానెటోరియం సందర్శన తదితర అంశాల్లో వీలైన వాటిని వినూత్న రీతిలో ఆలోచనలు రేకెత్తించేలా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి బీ రవినందన్‌రావును సంప్రదించాలని డీఈవో సూచించారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక సదస్సుకు జిల్లా సైన్స్ అధికారి

బీ రవినందన్‌రావు

జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక సదస్సుకు జిల్లా సైన్స్ అధికారి బీ రవినందన్‌రావు (భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు-కన్నాల ప్రభుత్వ పాఠశాల) ఎంపికైనట్లు డీఈవో డీ మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎస్సీఈఆర్‌టీలో శుక్రవారం నిర్వహించే వైజ్ఞానిక సదస్సుకు హాజరు కావాలని డీఎస్‌వో(జిల్లా సైన్స్ అధికారి)కు ఆహ్వా నం అందినట్లు వెల్లడించారు. 'సైన్స్ ఇన్ అవర్ వరల్డ్' ప్రధాన ఇతివృత్తంతో ఈ ఏడాది సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. 'విజ్ఞానశాస్త్ర విద్యలో ప్రమాణాలు పెంచేందుకు శాస్త్రీయ మార్గాలు' అనే అంశంపై డీఎస్‌వో తన పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్నట్లు వివరించారు. గతంలో జిల్లాలో వరుసగా రెండేళ్ల పాటు నిర్వహించిన సంచార ప్రయోగశాల కార్యక్రమం ద్వారా జరిగిన కృత్యాధార బోధనలోని పలు అంశాల ఆధారంగా ఈ పత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవోతో పాటు సమగ్ర శిక్షా సమన్వయకర్తలు పీఎం. షేక్, సీహెచ్ మల్లేశ్ గౌడ్, జీ కవిత, కన్నాల పాఠశాల హెచ్ఎం జె. కమలాకర్‌రావు, ఉపాధ్యాయులు, ఆర్పీలు వేర్వేరు ప్రకటనల్లో రవినందర్‌రావుకు అభినందనలు తెలిపారు. జిల్లా నుంచి ప్రత్యేకంగా కే జగదీశ్వర్‌రెడ్డి, వీ రజిత, ఎస్ కృష్ణమోహన మూర్తి, జీ దేవేందర్ కూడా పాల్గొననున్నారు.

విశ్రాంత జీఎంలతో సమీక్ష

సమావేశంలో జీఎం, రిటైర్డు జీఎంలు

గోదావరిఖని, ఫిబ్రవరి 26: ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో బుధవారం జీఎం లలిత్‌కుమార్ విశ్రాత జీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జీఎంగా ఉద్యోగ విరమణ అనంతరం వారు చేపడుతున్న విద్య సహాయం కార్యక్రమాలను జీఎంకు వివరించారు. ఉన్నత విద్యతోనే పేదరికం నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రిటైర్డు జీఎంలు పేర్కొన్నారు. అనంతరం జీఎం వారిని సన్మానించారు. ఇక్కడ ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఏరియా ఇంజినీర్ దాసరి వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఏజెంట్ రమేశ్, సర్వే అధికారి భాస్కర్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, బీమా, మోహన్‌రావు, రిటైర్డు జీఎంలు ఎల్ భుమారెడ్డి, సాహెబ్ హుస్సేన్, జీ సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కమాన్‌పూర్, ఫిబ్రవరి 26: జూలపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ చనిపోయాడు. వివరాలిలా ఉన్నాయి కమాన్‌పూర్ నుంచి యైటింక్లయిన్ కాలనీకి వెళ్తున్న టాటా ఏసీ ఆటో ట్రాలీ వాహనం జూలపల్లిలోని మల్లికార్జున నగర్ మూలమలుపు వద్ద సైకిల్‌పై ఇస్త్రీ బట్టలతో ఎదురుగా వస్తున్న బొడ్డుపెల్లి రాయమల్లు(51)ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాయమల్లుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటిక